# శిలావిగ్రహం

ఇచ్ఛాపురపు రామచంద్రం



న్యాయమూర్తి కోర్టు హాలులోకి ప్రవేశిస్తున్నారే కాని వారి మనసు మాత్రం ఇక్కడ లేదు. రెండు నెలల కిందట వారి తండ్రిగారు పరమపదించారు. ప్రజాసేవకుడూ, సంఘసంస్కర్తా, సౌజన్యమూర్తీ, మహనీయులూ ఐన తమ పితృపాదుల జ్ఞాపకార్థం తమ ఊరి నడిబొడ్డున ఆ కీర్తిశేషుల శిలా విగ్రహం స్థాపించి, వారిని చిరస్మరణీయులని చేయాలనీ, అలా తమ పితౄణం కొంతయినా తీర్చుకోవాలనీ వారి సంకల్పం. అందుకే శిల్పిని రప్పించి తమ జనకుల ఛాయాచిత్రం, అవసరమయిన వివరాలూ అందించి విగ్రహం తయారికిగానూ అడ్వాన్స్ కూడా ఇచ్చారు. ఐనా వారి మనసులో - శిల్పి అసలయిన పాలరాయే వాడతాడా? తన తండ్రిగారి రూపాన్ని సరిగ్గా చెక్కగలుగుతాడా? సకాలంలో శిల్పాన్ని పూర్తి చేసి ఇస్తాడా? - వంటి ఎన్నో సందేహాలు.

న్యాయమూర్తి తమ ఆసన్నాలంకరిస్తూంటే - బంట్రోతు "సైలెన్స్" అని అరిచాడు. గుమాస్తా వినయంగా ఫైళ్లనాయనముందుంచాడు.

లాయర్లు, స్టాఫ్, పత్రికా విలేకర్లు, పురజనులు ఇంకెదరితోనో కోర్టుహాలు అక్షరాలా కిటకిటలాడుతోంది. ఆ కేసు అటువంటిది. కోర్టుద్వారం అవతల ఎర్ర టోపీలూ, కాకీ ఆఫీసర్లూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

"యావజ్జీవ కారాగారవాసశిక్ష విధించడమైనది." అని తీర్పు ముగించారు న్యాయమూర్తి కోర్టు హాలులోని అందరు గుండెలు తేలిక పడినట్లు నిట్టూర్పు విడిచారు. బోనులోని దోషి తప్ప "శిక్ష గురించి నువ్వేమయినా కోర్టుకి

చెప్పుకోదలచుకుంటే చెప్పుకోవచ్చు". అనుమతిని ప్రసాదిస్తూ చెప్పుకుంటావా? అన్నట్లు చూశారు నేరస్తుడివేపు. అతను చెప్పుకుంటానన్నట్లు తల ఊపాడు. అందరి దృష్టి బోనులోని దోషి మీదకు తిరిగింది. అతనే రత్తయ్యంటే ఇప్పటికే నమ్మకం చాలడంలేదు వారెవరికీ. ఎందుకంటే - అతను నల్లగాలేడు. పొడవుగా లేడు. మరీధృఢంగానూ దుక్కగానూ తుమ్మమొద్దులాగనూ అసలు లేడు. అతనికి దుబ్బు జుట్టు లేదు, విల్లుల్లాటి మీసాలు లేవు. ఒత్తయిన గడ్డం అసలే లేదు. అతని చెంపమీద కత్తిగాటు లేదు, కళ్లల్లో ఎరుపు జీరలేదు. అతను గళ్లలుంగి కాని ఎర్రబనీను కాని వేసుకోలేదు. ఒక్కముక్కలో అతనిలో క్రూరత్వంకాని దౌష్ట్యంకాని ఏమాత్రమూ బయటకు ప్రదర్శింపబడకుండా అతను అందరిలాటి మామూలు మనిషిలాగే ఉన్నాడు. అదే వారందరి ఆశ్చర్యానికి హేతువు.

"నేను నేరాలు చేసిన మాట నిజమే. నా డైరీ ప్రకారం చిన్నవీ పెద్దవీ కలిసి ఈ పన్నెండేళ్లలోనూ నూటముప్పయ్యారు దొంగతనాలూ దోపిడీలు చేశాను. పధ్నాలుగు మర్డర్లూ, ఎనిమిది రేపులూ చేశాను. రేప్‌కమ్ మర్డర్లు ఆరు చేశాను. నా డైరీ అబద్ధం చెప్పదు.

నేనెందుకు నేరాల తోవనెన్నుకున్నానో ఆ కథేమీ మీకు చెప్పను. అది ప్రస్తుతము అసందర్భమూ అనవసరమూ కూడా. గొంతెండి చచ్చిపోతూంటే ఇంకుడు గొయ్యి తవ్వమని చెప్పడంలా ఉంటుంది నేనిప్పుడా కథ చెబితే. దాహార్తుడికి కావలసింది నీళ్ల నుయ్యి. మట్టి గొయ్యి కాదు.

నా నేరాలకు గాను నాకు యావజ్జీవకారాగారవాస శిక్ష విధించారు కోర్టువారు. ఇది - నా నేరాలకికాని నైజానికి కాని ఎంతమాత్రమూ తగిన శిక్షకాదని కోర్టుకి మనవి చేసుకుంటున్నాను. నాకు తగినశిక్ష విధించమని కోరడానికే నేను చెబుతున్నదంతా.

పిడుక్కీబియ్యానికీ ఒకటే మంత్రమా? అవేనేరాలు చేసినా మనిషినిబట్టి అతని స్వభావాన్ని బట్టే శిక్షలు కూడా మారుతుండాలని నా విన్నపం. న్యాయమూ ధర్మమూ కాగితాలలోంచి పుస్తకాలలోంచి కాక మనిషి గుండెలోంచి మనసులోంచి హృదయంలోంచి ఎలా రావాలో అలాగే శిక్షలూ స్వచ్ఛంగానూ సహజంగానూ రావాలని నా అభ్యర్థన.

మన పోలీసులు అతిమంచి వాళ్లు. కనుకనే నేనన్ని నేరాలు వరసపెట్టి చేస్తున్నా నన్ను పట్టుకోలేకపోయారు. ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాల చచ్చాడన్నట్లు - చిన్న దొంగతనంతో దొరికిపోయాను నేను. అప్పుడు కూడా వాళ్లేమాత్రం ఆరా తీసినా నానేర చరిత్రా రికార్డూ బయటపడేవి. కాని... వాళ్లు పోలీసులుకదా? అలా చెయ్యలేదు! ఆ నేరానికి అయితే ఈ కోర్టు మహా అయితే మూణ్నెల్లు శిక్ష వేసేది. కాని... నా అంతట నా నేరాలన్నీ బయట పెట్టుకున్నాను. పోలీసుల మీద జాలితో నేనే నా అపరాధాల డొంకను కదిల్చాను. కోర్టులో నేరం చేయలేదని ఎలా రుజువుచేసుకోవాలో నేరంచేసానన్నా రుజువులో, నిదర్శనలూ చూపి తీరాల్సిందే అంటే - అవి స్వయంగా నేనే చూపాను. నేనానేరాలన్నీ చేశానని కోర్టు తృప్తిపడేలా. ఇలా నాకు నేనే ఎందుకెసరు పెట్టుకున్నాను? నేలని పోయేదాన్ని తీసి నెత్తి కెందుకు పాముకున్నాను?"

జడ్జితో సహా శ్రోతలందరూ మరింత అప్రమత్తులయ్యారు. వాళ్లనిన్నాళ్లుగానూ వేధిస్తున్న ప్రశ్న ఇదే. అతను తనకి తానుగా ఎందుకు పెద్ద నేరాలను బయటపెట్టుకున్నాడు? "మనస్తత్వం గురించి మానవ స్వభావం గురించి కొంచెమయినా తెలిస్తే తప్ప నా ప్రవర్తన వెనుక కారణం అర్థంకాక నేనొట్టి తెలివితక్కువ వాడిలా అనిపించవొచ్చు. నేను చాలా అహంభావిని దానిని నేను ఆత్మాభిమానమని భావించుకుంటాను". ఒక్కసారాగి మళ్లీ చెప్పసాగాడు. "చిన్న నేరమయితేనేం, పెద్దనేరమయితేనేం నేను పోలీసులకి దొరికిపోయాక ఇకనా వృత్తి నైపుణ్యమూ, అనుభవమూ ఓడిపోయినట్లే అనిపించింది. ఇంకెందుకు బతకడం అనిపించేసింది. ఇక వృత్తి చెయ్యడం అనవసరమనిపించింది. నేను తగననిపించింది. నా అహం అంత దెబ్బతింది. నాకు నా వృతి మీదా జీవితం మీదా వైరాగ్యమొచ్చేసింది. అందుకే నాకుగా నేనే నా చరిత్ర చెప్పేసుకున్నాను, రుజువు చేసుకున్నాను. ఇక - నా శిక్ష నెందుకు మార్చమంటున్నానో ఎలాటి శిక్ష నాకు తగినదో తెలియాలంటే నా జీవన విధానం గురించి కూడా కొంచెం తెలుసుకోవాలి కోర్టువారు. నిజానికి నేను చేసిన నేరాలన్నిటినీ దృష్టిలోకి తీసుకుంటే నాకు ఉరిశిక్ష విధించవొచ్చు. కాని నా విషయంలో మాత్రం అది తగినది కాదు. జాతస్యమరణం ధృవం. అనాయాసమరణం, వినాదైన్యేన జీవనం... పులి మంత్రాలు చదువుతున్నట్లుందా? నేను చదువుకున్నవాడినే. ఊరంతా హఠాన్మరణం, వార్ధక్యమూ, రోగమూ వంటివి లేకుండా ఒక్క నిముషం. దానితో జీవన్ముక్తి. ఎంత సుఖం! మరి - ఇది నాలాటి వాటికి వరమౌతుందే తప్ప శిక్షెలా ఔతుందీ?" ఆలోచించమన్నట్లొకసారాగి ఊపిరి పీల్చుకున్నాడు. అప్పుడు మళ్లీ చెప్పసాగాడు.

"దొంగల తల్లి కేడవభయమని నానుడి" అలాగే.... తీవ్రమయిన నేరాలు చేసి బతికే వాడికి సంసారం నప్పదు. అందుచేత నేను ఒంటరిగానే ఉండిపోయాను. పోలీసులకి అనుమానం రాకుండా నగరం నాకెంత అసహ్యమేసేది. ఆ శిలావిగ్రహపు అసలు వ్యక్తి.... ఆ మహాత్ముడు ఎవరోకాని అతనిమీద మహాజాలేసేది. ఆ కీర్తిశేషుడికింతకంటే అవమానం మరేమీ ఉండదనిపించింది. తన విగ్రహానికి జరుగుతున్న దుశ్చర్యలు చూస్తే అతని ఆత్మ ఎంత ఘోషిస్తుందో కదా అనుకునేవాడిని. ఒక్కొక్కప్పుడు - ఆ శిలా విగ్రహాన్ని నిర్మూలించేద్దామా ఎవరూ చూడనప్పుడు - అన్నంత ఉద్రకం ఒచ్చేది. అలా అవమానాలకి ఒదిలెయ్యడం కంటే అదే నయమేమో! అనుకునేవాడిని. మరొకప్పుడు నాకు మరింత చిత్రమూ దారుణమూ ఐన ఆలోచన ఒచ్చేది. అదేమిటంటే...."

న్యాయమూర్తి తెల్లబోయి చేష్టలుడిగీ వినసాగారు, మిగిలిన శ్రోతలతో పాటే తనూ ఒకరై. "ఆ శిలా విగ్రహం నాదే ఐతే? నా విగ్రహానికలాటి అవమానాలు జరిగితే? అంతకంటే దుర్భరమూ దుస్సహమూ అయిన చిత్రహింస మరేదీ ఉండదనిపించింది. అంటే... నేను బతికుండగానే నా శిలా విగ్రహం స్థాపించి - నన్ను దానికి జరిగే అవమానాలన్నిటినీ కళ్లారా చూస్తూ ఉండవలసిన పరిస్థితి కల్పించితే అదే నాకు ఘోరాతి ఘోరమయిన శిక్షన్నమాట. కనుక కోర్టువారు నాకు నిజమయిన శిక్ష విధించాలనుకుంటే - సెంటర్లో నా శిలా విగ్రహమొకటి పెట్టి... అది మాత్రమే కనపడేలా దాని కెదురుగా బోనులాటి ఊచల గదికట్టి నా విగ్రహానికి జరిగే వికృతాలన్నీ నేను తప్పనిసరిగా చూడవలసివొచ్చేటట్లు చేస్తే అదే నాకు తగిన శిక్షవుతుందని కోర్టువారు గ్రహించి.." అని ముగించాడు.

"అది సాధ్యపడదు." అని చెప్పేసి తన ఛాంబర్‌లోకి వేగంగా వెళ్లిపోయి - టెలిఫోన్ తీసుకున్నారు న్యాయమూర్తి. నంబరు డయల్ చేశారు.

"ఆ...నేనే.. ఉదయం కీర్తిశేషులయిన మా నాన్నగారి శిలావిగ్రహం తయారుచేయమని మీకు ఆర్డరిచ్చాను కదా? దయచేసి ఆ ఆర్డరు రద్దుపరచండి. ఆ విగ్రహం చెయ్యొద్దు. ప్లీజ్...క్యాన్సిల్... అడ్వాన్స్ వాపసివ్వక్కర్లేదు. కాని... ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ విగ్రహం మాత్రం తయారు చెయ్యొద్దు. అంతే... థాంక్యూ." అని రిసీవర్ పెట్టేసి ముఖం మీద చెమటలు తుడుచుకున్నారు. పరమపదించిన తన తండ్రిగారి కింత కంటే మేలు మరేమీ చెయ్యలేననిపించిందా న్యాయమూర్తికి. ❋